సాక్షి


అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం ı 10 ı అక్టోబర్ ı 2024



సింహగిరిపై ఆయుధపూజ

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. IIలో



విద్యాలక్ష్మిగా కనకమహాలక్ష్మి

కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. IIలో



చట్టాలపై అవగాహన అవసరం

చట్టాలపై గిరిజన ప్రాంతాల్లో మహిళలు అవగాహన పెంచుకోవాలని సివిల్ జడ్జి వెంకటశేషమ్మ తెలిపారు. IIలో

న్యూస్‌రీల్

నిర్వాసితులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లింపు

- సబ్‌కలెక్టర్ కల్పశ్రీ



భూముల రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు త్వరితగతిన నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. గంగవరం మండలంలోని గంగవరం,పెద్ద అడ్డపల్లి గ్రామాల్లో జాతీయ రహదారి 516ఇ భూసేకరణ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో ఇళ్ల,వ్యవసాయ భూములు కోల్పోయిన వారందరికీన్యాయం చేస్తామన్నారు.సర్వే కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించారు.పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించామని, పెండింగ్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్‌శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకప్రాంతాల్లో కొత్త ప్రాజెక్టులు



లంబసింగిలో పర్యాటకశాఖ రిసార్టును పరిశీలిస్తున్న బాలాజీ

చింతపల్లి: టూరిస్టులను ఆకట్టుకునేలా జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో త్వరలో మరిన్ని కొత్తప్రాజెక్టుల ఏర్పాటుకు రూపకల్పన చేస్తున్నట్టు ఏపీ పర్యాటకశాఖ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన చింతపల్లి మండలం లంబసింగిలో పర్యటించి, ఏపీటూరిజంశాఖ నిర్మించిన రిసార్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే లంబసింగి, తాజంగి, చెరువులవేనం, కొత్తపల్లి, వంజంగి, ఎర్రవరం జలపాతాలు తదితర ప్రాంతాలు పర్యాటకపరంగా మంచి గుర్తింపు పొందాయన్నారు. పర్యాటకులను మరింతగా ఆకట్టుకునే విధంగా ఈ ప్రాంతాల్లో సరికొత్త ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తామని చెప్పారు. ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నామన్నారు. ఈకార్యక్రమంలో పర్యాటకశాఖ లంబసింగి టూరిజం మేనేజరు సూరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

విద్యా సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

జి.మాడుగుల: దసరా సెలవులు ముగిసేలోగా మండలంలోని పాఠశాలల విద్యా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక మండల విద్యాకార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబూరావు పడాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా రాజ్‌మా

జిల్లాలో ముందస్తు రబీ పంటగా సాగు చేసే రాజ్‌మాకు ఈ ఏడాది కూడా వాతావరణం కలిసొచ్చింది. మొక్క దశలో పంట కళకళలాడుతోంది. డిసెంబర్ నాటికి పంట చేతికి వస్తుందని, అధిక దిగుబడులు లభించే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు మండలం గబ్బంగి మెట్ట ప్రాంతంలో మొక్క దశలో పంట

- కలిసొచ్చిన వాతావరణం
- మొక్కదశలో పంట కళకళ
- డిసెంబర్ నాటికి దిగుబడులు

సాక్షి, పాడేరు: జిల్లాలో ఆదివాసీ రైతులను రాజ్‌మా పంట ఆర్థికంగా ఆదుకుంటోంది. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేయడం, మంచి ఆదాయం లభిస్తుండడంతో ఈ పంట సాగుపై గిరి రైతులు మళ్లీ ఆసక్తి చూపుతున్నారు. మెట్ట,కొండపోడు భూముల్లో నెల రోజుల కిందట విత్తనాలు జల్లారు. ప్రస్తుతం మొక్కదశలో పంట కళకళలాడుతోంది. సిరుల పంట రాజ్‌మా ఆశాజనకంగా ఎదుగుతుండడంతో డిసెంబర్ మొదటి వారానికే దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

10 వేల హెక్టార్లలో సాగు

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల్లోని మెట్ట,కొండపోడు భూములు మాత్రమే రాజ్‌మా చిక్కుళ్ల పంట సాగుకు అనుకూలం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజ్‌మా సాగు విస్తరణకు చర్యలు తీసుకుంది. గంజాయికి ప్రత్యామ్నాయ పంటగా రాజ్‌మాను ప్రోత్సహించడంతో గత నాలుగేళ్ల నుంచి మారుమూల ప్రాంతాల్లోని గిరిజన రైతులు ఈ పంటను సాగును చేస్తూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. 2019లో 12వేల ఎకరాలకే పరిమితమైన రాజ్‌మా పంట సాగు విస్తీర్ణం క్రమేపీ పెరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలను ఏటా 4వేల నుంచి 4,300 క్వింటాళ్ల వరకు రైతులకు పంపిణీ చేయడంతో సాగుకు ఎంతో మేలు జరిగింది. ఎర్లీ రబీ క్రాప్‌గా గుర్తింపు పొందిన ఈ పంటను 10వేల హెక్టార్లలో సుమారు 40 వేల మంది గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలకు ఇండెంట్ పెట్టింది. దీంతో ఈఏడాది కూడా 4,500 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను ఆగస్టు నుంచే వ్యవసాయశాఖ పంపిణీని ప్రారంభించడంతో గిరిజన రైతులకు విత్తన సమస్య లేకుండా పోయింది.సుమారు 9వేల హెక్టార్లకు సరిపడే విత్తనాలను వ్యవసాయశాఖ అందుబాటులో తెచ్చింది.



పెదబయలు మండలం లక్ష్మీపేట వద్ద సాగవుతున్న రాజ్‌మా

ఎకరానికి 250 కిలోల దిగుబడి

రాజ్‌మా గింజలకు ఈశాన్య రాష్ట్రాలలో మంచి డిమాండ్ ఉంది. జిల్లాలో గిరిజనులు సాగు చేసే రాజ్‌మాను డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేస్తారు. గత ఏడాది కిలో రూ.90ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు.ఎకరానికి 200 నుంచి 250 కిలోల వరకు దిగుబడికి వస్తుంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పాటు పువ్వు దశ ఏర్పడడంతో డిసెంబర్ నాటికే పంట దిగుబడి ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

> **దిగుబడులు బాగుంటాయి**
>
> 
>
> రాజ్‌మా విత్తనాలు సకాలంలో పంపిణీ చేశాం. గిరిజన రైతులు కూడా సరైన సమయంలోనే విత్తనాలు జల్లుకున్నారు.ఇటీవల పలు ప్రాంతాల్లో పంటను పరిశీలించాం. మొక్క దశలో పంట ఎదుగుదల బాగుంది. పూత కూడా ఏర్పడుతుండడంతో వేగంగానే గింజ దశకు చేరుకుంటుంది.ఈ ఏడాది కూడా రాజ్‌మా దిగుబడులు బాగుంటాయి.
>
> – ఎస్.బి.ఎస్.నందు, జిల్లా వ్యవసాయాధికారి

> **మారుమూల ప్రాంతాల్లో సాగు అధికం**
>
> 
>
> మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు రాజ్‌మాను అధికంగా సాగు చేస్తున్నారు. ఇంజరి పంచాయతీలో కూడా నాలుగేళ్ల నుంచి రాజ్‌మా సాగు చేస్తున్నాం. 90శాతం సబ్సిడీపై విత్తనాలను ప్రభుత్వం అందజేస్తోంది. కొండపోడు,మెట్ట భూముల్లో రాజ్‌మా పంటను సాగు చేసుకుంటూ ఏటా మంచి ఆదాయం పొందుతున్నాం.
>
> – మెండిపల్లి సన్యాసిరావు, గిరిజన రైతు, ఇంజరి పంచాయతీ, పెదబయలు మండలం

గంజాయి రవాణాపై మరింత నిఘా

- ఆధునిక సాంకేతికతతో డైనమిక్ వెహికల్ చెకింగ్
- గంజాయి రైతులకు ప్రత్యామ్నాయం చూపాలి
- సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెరగాలి
- ఎస్పీల సమావేశంలో డీఐజీ గోపీనాథ్ జట్టి



సాక్షి, విశాఖపట్నం: ఏజెన్సీ నుంచి గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచి, నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు.బుధవారం విశాఖ రేంజ్ పరిధిలోని అనకాపల్లి, విజయనగరం, అల్లూరి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణలో భాగంగా డైనమిక్ వెహికల్ చెకింగ్‌ను ఆకస్మికంగా చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. రేంజ్ పరిధిలో ఎక్కడా గంజాయి సాగు జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం 'కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి చెక్ పోస్టుల వద్ద వాహన తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని, స్నిఫర్ డాగ్స్‌తో ఇప్పటికే గుర్తించిన హాట్ స్పాట్ల వద్ద తనిఖీలు చేయాలన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేయాలన్నారు. పేకాట స్థావరాలపై కూడా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి, దాడులు నిర్వహించాలని జిల్లాల ఎస్పీలను రేంజ్ డీఐజీ ఆదేశించారు.

దీపావళి వస్తోంది జాగ్రత్త

దీపావళి పండగ సందర్భంగా బాణసంచా దుకాణాలు, గొడౌన్ల వద్ద భద్రత ప్రమాణాలను పర్యవేక్షించాలని డీఐజీ ఆదేశించారు. అనధికారంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రతి జిల్లాలో నేరాలు ఎక్కువగా జరిగే ఏరియాలను గుర్తించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రజలకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలని, గతంలో నమోదైన సైబర్ కేసుల్లో బ్యాంకు అకౌంట్లలో ఫ్రీజ్ అయిన నగదు బాధితులకు తిరిగి చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దర్యాప్తులో ఉన్న హత్య కేసులు, లాంగ్ పెండింగ్ కేసులు, లైంగిక దాడులు, వరకట్న మరణాలు, పోక్సో కేసులను రేంజ్ డీఐజీ సమీక్షించి, దర్యాప్తు వేగవంతం చేయాలని జిల్లాల ఎస్పీలను విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. ఈ జూమ్ కాన్ఫరెన్సులో అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక, అల్లూరి ఎస్పీ అమిత్ బర్దర్, విజయనగరం ఎస్పీ వకుల్ జిందల్, శ్రీకాకుళం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికపై బాలుడి లైంగికదాడి

ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

హుకుంపేట: మండలంలో బాలికపై లైంగికదాడి జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానిక సీఐ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దిగుడుపుట్టు గ్రామానికి చెందిన బాలిక(15)ను అదే మండలంలోని గూడ గ్రామానికి చెందిన బాలుడు (16) ప్రేమ పేరుతో మంగళవారం తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి చేసినట్టు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ వేణుగోపాలరావు గూడ గ్రామం చేరుకుని గ్రామస్తులను విచారించారు. లైంగికదాడికి గురైన బాలికను వైద్య పరీక్షల నిమిత్తం పాడేరు ఆస్పత్రికి పంపినట్లు సీఐ తెలిపారు. లైంగికదాడికి పాల్పడిన బాలుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.



గూడ గ్రామంలో విచారణ జరుపుతున్న డీఎస్పీ వేణుగోపాలరావు

40 మద్యం దుకాణాలకు 591 దరఖాస్తులు

- ఈనెల 11 వరకు గడువు
- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్

పాడేరు : జిల్లా వ్యాప్తంగా కేటాయించిన 40 మద్యం దుకాణాల కోసం ఇప్పటి వరకు 591 దరఖాస్తులు అందినట్టు విశాఖపట్నం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మహేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. మద్యం దుకాణాల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయో తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పాడేరు, అరకులోయ, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 40 మద్యం దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. ఇప్పటి వరకు పాడేరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 116 దరఖాస్తులు రాగా, అరకువేలిలో 76, చింతపల్లిలో 76, రంపచోడవరంలో 11, చింతూరు పరిధిలో 221 దరఖాస్తులు అందాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం తొలుత ఈనెల 9వరకే సమయమిచ్చిందని కానీ దరఖాస్తుదారుల విజ్ఞప్తి మేరకు ఈనెల 11 వరకు పొడిగించినట్టు చెప్పారు. పాడేరు స్టేషన్ పరిధిలోని పెదబయలుకు కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు కేవలం రెండు దరఖాస్తులు రాగా, జి.మాడుగులలో కేటాయించిన రెండు మద్యం దుకాణాలకు మూడు దరఖాస్తులు వచ్చాయన్నారు. గిరిజన ప్రాంతంలో ఎక్కడా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు ప్రస్తుతం ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు ఉందని చెప్పారు. పాడేరు వీఆర్ కల్యాణ మండపంలో 14వ తేదీ ఉదయం 7గంటల నుంచి లాటరీ విధానం ద్వారా షాపులను కేటాయిస్తామని 16 నుంచి కొత్త మద్యం దుకాణాలు తెరుచుకుంటాయని తెలిపారు. జిల్లాలో కేవలం ఎస్టీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ రాజారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు

కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో అర్హులైన రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలని కలెక్టర్ ఎ.ఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ పీవోలు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖ, సెరీకల్చర్, కాఫీ బోర్డు, స్పైసెస్ బోర్డు అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాఫీ, జీడి, రబ్బరు తోటలు, మిరియాల సాగుతో రైతులు పొందుతున్న ఆదాయం, మార్కెటింగ్ సదుపాయం, గిట్టుబాటు ధరలపై సమీక్షించారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడానికి అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు బ్యాంకు లింకేజీ అందించాలని సూచించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో 34 వేల మంది రైతులు 64 వేల ఎకరాల్లో జీడి తోటలు, 3,180 ఎకరాల్లో జాఫ్రా తోటలు పెంచుతున్నారుని చెప్పారు. 3 వేల మంది రబ్బరు సాగుచేస్తున్నట్టు చెప్పారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు ఉత్పత్తుల విక్రయాలకు డిజిటల్ తూనిక యంత్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ 1.9 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారని 75 వేల మెట్రిక్ టన్నుల కాఫీ పళ్లు దిగుబడులు వస్తున్నాయన్నారు. గత ఏడాది కాఫీ రైతులకు కాఫీ పళ్లు కిలోకు రూ.43 చెల్లించామని, అదనంగా మరో మూడు రూపాయలు బోనస్‌గా అందిస్తున్నామని చెప్పారు. ఈఏడాది రెండు వేల టన్నుల కాఫీ పళ్లు సేకరణ లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. నాణ్యమైన కాఫీ పళ్లు సరఫరా చేసేలా లైజన్ వర్కర్ల ద్వారా కాఫీ రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పామాయిల్ తోటలు సాగుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ పీవో కె.సింహాచలం, చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్. నంద్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేష్‌కుమార్ రావు, కాఫీ బోర్డు డీడీ రమేష్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి, జీసీసీ డీఎంలు సింహాచలం, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ, ఇతర సభ్యులు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతో పాటు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించే లక్ష్యంతో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారుల సదస్సులు నిర్వహిస్తున్నట్టు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్,రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. పాడేరు ఈఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన 21మంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరాకు తగిన ఆదేశాలిస్తున్నట్టు చెప్పారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు ఎస్.మసీలా మణి,స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్,విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ జి.ఎన్.ప్రసాద్, ఈఈ ఎ.వి.ఎస్.అప్పారావు,పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పాల్గొన్నారు.

అనారోగ్యంతో శిశువు మృతి



అనారోగ్యంతో మృతి చెందిన పాప

పెదబయలు: జిల్లాలో శిశు మరణాలు ఆగడం లేదు. ఎక్కడో చోట అనారోగ్యంతో శిశువులు మరణిస్తూనే ఉన్నారు. తాజాగా పెదబయలు పీహెచ్‌సీ పరిధిలోని లక్ష్మీపేట పంచాయతీ కిలుములు గ్రామానికి చెందిన కోరాబు సూర్యనారాయణ,సౌజన్య దంపతుల కుమార్తె (3నెలలు) మృతి చెందింది. మూడు రోజుల నుంచి దగ్గు,జలుబుతో పాటు కడుపు ఉబ్బి పాప బాధపడుతోంది. తల్లిదండ్రులు ఈనెల 8న ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.అక్కడ ఒక్క రోజు చికిత్స అనంతరం కేజీహెచ్‌కు బుధవారం తరలిస్తుండగా మార్గమధ్యంలో శిశువు మృతి చెందింది. మూడు రోజుల నుంచి పాపకు ఆరోగ్యం బాగోలేకపోయినాస్థానిక ఆశ కార్యకర్త, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పట్టించుకోదని బంధువులు ఆరోపించారు. ఈవిషయంపై లక్ష్మీపేట ఏఎన్‌ఎం సుమలతను వివరణ కోరగా 8తేదీన కిలుములు, బల్లపురాయి,మొండికోట,కుడాసింగి గ్రామాల్లో 104 వాహనం ద్వారా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, అక్కడ పాప అనారోగ్యంతో బాధపడుతున్నట్టు గుర్తించి ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు.సౌజన్యకు ఇంతకు ముందు కాన్పులో రెండేళ్ల కిందట పుట్టిన బా బు మూడు నెలల వయస్సులో మృతిచెందినట్టు బంధువులు తెలిపారు.

పసికందు మృతిపై సబ్ కలెక్టరు విచారణ



సబ్ కలెక్టరుకు వివరాలు తెలిపేందుకు వచ్చిన బాధితులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరు పీహెచ్‌సీలో ఆదివారం వైద్యం అందక రెండు నెలల చిన్నారి మృతి చెందిన ఘటనపై సబ్ కలెక్టరు శౌర్యమన్‌పటేల్ బుధవారం విచారణ జరిపారు. చిన్నారి తల్లిదండ్రులు, గ్రామస్తులు, పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యాధికారులతో విడివిడిగా మాట్లాడి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తమ రెండు నెలల కుమార్తెకు దగ్గు, ఆయాసం,జ్వరం తీవ్రంగా ఉండడంతో వలసగెడ్డ గ్రామానికి చెందిన తాంబేలు సామర, పూర్ణిమ దంపతులు సీలేరు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యులు అందుబాటులో లేకపోవడం,విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు దేవి చిన్నపిల్లల డాక్టర్లు లేరని,చింతపల్లి లేదా చింతూరు తీసుకొని వెళ్లాలని చెప్పారు. కనీసం ఓపీ కూడా రాయకపోవడంతో చాలా సేపు ఆస్పత్రి వద్దే ఉండి గ్రామానికి తీసుకొని వెళ్లామని, అదేరోజు అర్ధరాత్రి పాప మృతి చెందిందని, సకాలంలో స్పందించి ఉంటే పాప బతికి ఉండే దని తల్లిదండ్రులు తెలిపారు. సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని సబ్ కలెక్టర్ వద్ద పలువురు ఆరోపించారు. వైద్యాధికారులు ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగులను పట్టించుకోవడం లేదని తెలిపారు. డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినా మార్పురాలేదని తెలిపారు. జీకే వీధి తహసీల్దార్ కుమారస్వామి, సర్పంచ్‌లు దుర్జో, కుమారి ,ఎంపీటీసీ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పాడేరు రాజరాజేశ్వరి దేవాలయంలో చిన్నారులకు పలకలు,పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఉషారాణి, కమిటీ ప్రతినిధులు



అరకులోయలో సరస్వతీదేవి పూజలో పాల్గొన్న బాలబాలికలు

వీణా పుస్తక ధారిణి.. వందే అక్షర రూపిణి



అరకులోయలో సరస్వతీదేవి వేషధారణలో చిన్నారి

సాక్షి,పాడేరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. పాడేరులోని రాజరాజేశ్వరి,సంగోడిలోని పార్వతీదేవి,వంతాడపల్లిలోని కామాక్షమ్మ,ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని కనకదుర్గమ్మతల్లి,అరకులోయ పట్టణంలోని భ్రమరాంబదేవిలను సరస్వతీదేవిగా అలంకరించి అర్చకులు కుంకుమార్చన చేశారు. రాజరాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో చిన్నారులకు సామూహికంగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు.సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి,ఆలయ ధర్మకర్తమండలి సభ్యుడు కొట్టగుళ్లి సుబ్బారావు, ఇతర ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు చిన్నారులకు పలకలు,పుస్తకాలు పంపిణీ చేశారు. అరకులోయలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవి ఆలయంలోను సరస్వతీదేవికి పూజలు చేయడంతో పాటు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతీదేవి వేషధారణలో కావ్యశ్రీ అనే బాలిక అలరించింది.

ధర..గుండె దడ

టమాటా ధర తారెత్తిస్తోంది.. బీన్స్, ఇతర రకాల చిక్కుళ్లు అదే బాట పట్టాయి. ఉల్లి, వెల్లుల్లి, పచ్చి మిరపకాయలు కళ్ల నుంచి నీళ్లు తెప్పిస్తున్నాయి....కనీసం ఆకుకూరల రేట్లు కూడా అందుబాటులో లేకుండా తారల చెంతకు చేరాయి.

- తారల చెంతకు కూరల ధరలు
- సెంచరీ దాటిన రేట్లు
- బెంబేలెత్తుతున్న సాధారణ జనం





పాడేరులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సాక్షి,పాడేరు: కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో సాధారణ జనం బెంబేలెత్తుతున్నారు. మైదాన ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి రోజురోజుకూ ధరలను పెంచుతున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు,వారపుసంతలలో అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారు. ఉల్లి,వెల్లుల్లితో పాటు కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతుల ధరలు పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పచ్చిమిర్చిని కూడా కొనలేని పరిస్థితి నెలకొంది.

సెంచరీట దాటి...

టమోటా ధర అమాంతం పెరిగింది. ప్రస్తుతం సెంచరీకొట్టింది. రూ.100కు విక్రయిస్తున్నారు. బీన్స్,ఇతర చిక్కుళ్ల రకాలు కూడా కిలో రూ.100కు పైగానే అమ్ముతున్నారు. బెండ,బీరకాయలను కిలో రూ.80,వంకాయలు కిలో రూ.70, ఉల్లి కిలో రూ.60, బంగాళా దుంపలు కిలో రూ.50కు అమ్ముతున్నారు. క్యారట్, బీట్‌రూట్, కాలీఫ్లవర్, క్యాబేజీ తదితర ధరలకు రెక్కలొచ్చాయి.

సంతల్లో రెట్టింపు

వారపు సంతలే గిరిజనులకు ప్రధాన ఆధారం కావడంతో అక్కడ వ్యాపారులు కూరగాయలు, ఇతర ఉత్పత్తుల ధరలను మరింత పెంచి అమ్మకాలు జరుపుతున్నారు.గిరిజనులంతా వారానికి సరిపడే నిత్యావసరాలను సంతల్లోనే కొనుగోలు చేస్తారు. సంతల్లో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. ధరల నియంత్రణకు కనీస చర్యలు తీసుకోవడం లేదు.

వ్యాపారులు సిండికేట్‌గా మారి...

మైదాన ప్రాంతాలైన విజయనగరం, ఎస్.కోట, విశాఖ, గాజువాక, అనకాపల్లి, తుని, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కూరగాయలు, దుంపజాతులు, ఉల్లిపాయలు,ఆకుకూరలను వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.మైదాన ప్రాంతాల్లో ధరలు తక్కువగానే ఉన్నప్పటికీ జిల్లాలో పెంచి అమ్మకాలు జరుపుతున్నారు.మండల కేంద్రాలలో రిటైల్ కూరగాయల వ్యాపారులంతా సిండికేట్‌గా మారడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

అల్లం కిలో, బీన్స్	రూ.120
పచ్చిమిర్చి, బీరకాయలు, దొండకాయలు, బెండకాయలు	రూ.80
వంకాయలు, గోరు చిక్కుడు	రూ.70
క్యారట్, బంగాళాదుంప, ముల్లంగి	రూ.50
బీట్‌రూట్, క్యాబేజీ	రూ.40

క్లుప్తంగా

సింహగిరిపై ఘనంగా ఆయుధపూజ

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు సన్నిధిలో ఈ పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితర ఆయుధాలను ఉంచారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, ఆయుధ దేవత ఆవాహనం , ఆరాధన నిర్వహించారు. అనంతరం పూజలో ఉంచిన ఆయుధాలను సింహవల్లీ తాయారుకి అలంకరించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈ పూజ నిర్వహించారు. విజయదశమి వరకు సింహవల్లీ తాయారు సన్నిధిలోనే ఆయుధాలను ఉంచుతారు.

చట్టాలపై గిరిజన మహిళలకు అవగాహన అవసరం

చింతపల్లి: చట్టాలపై గిరిజన ప్రాంతాల్లో మహిళలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్‌సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ అన్నారు. జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాసాధికారికసంస్థ ఆధ్వర్యంలో చింతపల్లిలో బుధవారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న లైంగికదాడులు, హత్యలు, దౌర్జన్యాలు, వరకట్నవేధింపులు, గృహహింస, సైబర్‌నేరాలు, బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.ప్రతి న్యాయస్థానంలోనూ ప్రత్యేకంగా మహిళలకు ఉచితంగా న్యాయ సహాయం అందించేలా లీగల్‌సెల్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో శిశుసంక్షేమశాఖ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో జమాల్ బాషా, డీపీవో కొండలరావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, గిరిజన సంక్షేమశాఖ డీడీ రజని చింతపల్లి తహసీల్దార్‌రవికుమార్, ఏటీడబ్ల్యూవో నాగలక్ష్మి, చింతపల్లి ఐసీడీఎస్‌పీఓ రమణి, ఏపీడీపీఓ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

80 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్ట్, ఆటో, బైక్ స్వాధీనం



పట్టుబడిన గంజాయితో నిందితులు

కొయ్యూరు: గూడెంకొత్తవీధి మండలం వంచుల నుంచి మైదాన ప్రాంతం తునికి తరలిస్తున్న 80 కిలోల గంజాయిని కొయ్యూరు ఎస్‌ఐ వి.నాగార్జున స్వాధీనం చేసుకున్నారు. చీడిపాలెం జంక్షన్‌లో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు ఆర్‌వీ నగర్ నుంచి గంజాయి లోడుతో వస్తున్న ఆటోను పట్టుకున్నారు. ఆటోలో మూడు బస్తాల్లో ఉన్న 80 కిలోల గంజాయి బయటపడింది. ఆటోకు ముందు పైలట్‌గా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నాగార్జున మాట్లాడుతూ వంచుల పంచాయతీ మురగడపల్లికి చెందిన వంతల రాజుబాబు, వంతల సుబ్బారావు, కిలో లేసు, గూడేనికి చెందిన పాంగి సత్తిబాబును అరెస్టు చేసినట్టు చెప్పారు.

పాడేరు మెడికల్ కళాశాలకు 150 సీట్లు కేటాయించాలి

- 50 సీట్లకే పరిమితం చేయడం అన్యాయం
- కూటమి ప్రభుత్వానికి గిరిజనులంటే చిన్నచూపు
- పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పాడేరు మెడికల్ కళాశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సాక్షి, పాడేరు: కూటమి ప్రభుత్వానికి గిరిజనులంటే చిన్నచూపని, పాడేరు మెడికల్ కళాశాలకు కేవలం 50 సీట్లే కేటాయించడం అన్యాయమని పాడేరు ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి 2019లో ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు పాడేరులో మెడికల్ కళాశాల మంజూరు చేస్తామని,గిరిజన బిడ్డలకు వైద్య విద్య, కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తెస్తానని ఇచ్చిన హామీ మేరకు రూ.500కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో 58శాతం భవన నిర్మాణాలు జరిగాయన్నారు. తమ ప్రభుత్వం 150సీట్లతో మెడికల్ కళాశాల ప్రారంభించాలని భావిస్తే,కూటమి ప్రభుత్వం మాత్రం పాడేరు,అరకులోయలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఉన్నారనే కారణంతో కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేవలం 50సీట్లకే పరిమితం చేయడం దారుణమని చెప్పారు. గిరిజనుల సంక్షేమంపై కూటమి ప్రభుత్వం,ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే పాడేరు మెడికల్ కళాశాలకు 150సీట్లు కేటాయించాలని,పూర్తిస్థాయిలో వైద్యసౌకర్యాలు మెరుగుపరచాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

నాన్నే సూపర్ హీరో

హీరో సుధీర్‌బాబు



మాట్లాడుతున్న సుధీర్‌బాబు

ఎంవీపీకాలనీ: తాను హీరోగా నటించిన 'మా నాన్న సూపర్ హీరో' ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెలుగు ప్రేక్షకులందరినీ అలరిస్తుందని యువ హీరో సుధీర్ బాబు అన్నారు. ఈ నెల 11న ఈ సినిమా విడుదలవుతుందని, విజయవంతం చేయాలని ప్రేక్షకులను కోరారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఎంవీపీకాలనీ గాదిరాజు ప్యాలెస్‌లో బుధవారం హీరో సుధీర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ఈ చిత్రానికి అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వం వహించగా.. ఆర్ణ హీరోయిన్‌గా నటించినట్లు తెలిపారు. సాయి చంద్, సాయాజీ షిండేలు కీల కపాత్రలు పోషించారన్నారు. తండ్రి- కుమారుడి మధ్య ఎమోషన్స్‌ను ఈ సినిమా ప్రధానంగా ఆవిష్కరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ సూపర్ హీరో నాన్నే అన్నారు. దీన్ని ఇతివృత్తంగా తీసుకుని ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు చుట్టూ నడిచే ట్రయాంగిల్ లవ్ స్టోరీగా దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌లలో ప్రీమియర్ షోలు వేస్తున్నట్లు తెలిపారు. ఫ్యాన్స్ తనని నవ దళపతిగా పిలుచుకోవడం ఆనందంగా ఉందన్న ఆయన.. సినిమాల నుంచి రిటైర్డ్ అయ్యాక విశాఖలో స్థిరపడాలనేది తన ఆకాంక్ష అన్నారు. అనంతరం ఫ్యాన్స్‌తో సమావేశమై సందడి చేశారు.

ఐదు కోర్సుల్లో నిరుద్యోగులకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నామని షీలానగర్‌లోని బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్టుఫోలియో మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్, వేర్ హౌస్ డేటా ఫీడర్ ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ శిక్షణకు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్ల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. మూడు నెలల పాటు ఇచ్చే శిక్షణలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. సీనియర్ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ కె.ఆర్.కిరణ్‌కుమార్, బొల్లినేని సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలక్ష్మిగా కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి అమ్మవారు బుధవారం విద్యాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి శ్రీపుష్పయాగం పూజ నిర్వహించారు. సింబియాసిస్ అధినేత ఒ.నరేష్‌కుమార్ రూ.55వేలు చెల్లించి పుష్పయాగంలో పాల్గొన్నారు. అమ్మవారికి అలంకరించిన పట్టు చీరలు లక్కీ షాపింగ్‌మాల్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌మారు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గిరిజనులకు సేవ చేయడమే లక్ష్యం



వీల్ చైర్లు పంపిణీ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజనులకు సేవ చేయడమే లక్ష్యంగా ఆర్‌ఎస్ సొసైటీ పనిచేస్తోందని సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ కంటా స్వాతి తెలిపారు. రంపచోడవరం పీఎంఆర్‌సీలో సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొని దివ్యాంగులకు వీల్‌చైర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా ఏజెన్సీలో వంద సేవా కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు. సంస్థ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న వలంటీర్లకు సబ్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.

కొత్తపల్లి జతపాతం సుందరీకరణ పనుల పరిశీలన

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం సుందరీకరణ పనులను మంగళవారం రాత్రి పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. ఈ నెలాఖరుకు పనులను పూర్తి చేయాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పీవో స్వయంగా పరిశీలిస్తున్నారు. అంతర్గత విద్యుదీకరణ, పెయింటింగ్ తదితర పనులను ఆయన పరిశీలించారు. ఇక్కడ పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

జిల్లా కేంద్రాన్ని పాడేరు నుంచి తరలిస్తే సహించేది లేదు

- గిరిజనులకు అన్ని విధాలుగా అండగా వైఎస్సార్‌సీపీ
- మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై మండిపాటు

డుంబ్రిగుడ: వెనకబడిన గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అల్లూరి జిల్లాగా ప్రకటించారని అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గుర్తు చేశారు. ఆయన బుధవారం అమెరికా నుంచి ఫోన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంగా పాడేరు ఉండడంతో జిల్లా అధికారులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డి యోచించి, పాడేరును జిల్లా కేంద్రంగా ప్రకటించారన్నారు. పాడేరు అన్నివిధాల జిల్లా కేంద్రానికి అనువైన ప్రదేశమని అదే జిల్లా కేంద్రం నర్సీపట్నం కేంద్రంగా తరలిస్తే గిరిజన ప్రాంత ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రాన్ని నర్సీపట్నం తరలించే యోచనను కూటమి ప్రభుత్వం మార్చుకోవాలని లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ పాటు జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు, ఉద్యోగసంఘాలు, ఏకమై ఉద్యమం చేపడతామని మాజీ ఎమ్మెల్యే పాల్గుణ హెచ్చరించారు. స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా అభివృద్ధి నోచుకోని వెనకబడిన ఉన్న గిరిజన ప్రాంతాన్ని ఒక జిల్లాగా ఏర్పడి ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతుందని, ఇలాంటి తరుణంలో ఇదే అల్లూరి జిల్లాని నర్సీపట్నం కేంద్రంగా కొనసాగిస్తే ఊరుకోం అని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతం ప్రజలు బాగుపడడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఈ విషయమై గిరిజనులకు అండగ వైఎస్సార్‌సీపీ నిలుస్తోందని భరోసా ఇచ్చారు.

దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభం



పాడేరులో కొలువుదీరిన కనకదుర్గమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



పాడేరు మెయిన్‌రోడ్డులో విద్యుత్ దీపాలంకరణ

సాక్షి, పాడేరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ఆస్పత్రి సెంటర్‌లో కనకదుర్గమ్మతల్లి ఉత్సవాలు బుధవారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా దుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించిన అనంతరం భక్తిశ్రద్ధలతో మండపంలో ప్రతిష్ఠించారు.అనంతరం ప్రముఖ అర్చకులు ప్రభాకర్‌శర్మ దుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ టి.నరసింగరావు దంపతులతో పాటు వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, వర్తక సంఘం నేతలు సోమరాజు, నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ రామునాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీను, బుజ్జి, కమిటీ ప్రతినిధులంతా భక్తులతో కలిసి పూజలు చేశారు. ప్రత్యేక సెట్టింగ్‌తో నిర్మించిన మండపం ఆకట్టుకుంటుంది. ఎస్‌బీఐ నుంచి సుండ్రుపుట్టు వరకు మెయిన్‌రోడ్డులో విద్యుత్ అలంకరణ కనువిందు చేస్తుంది. దసరా ఉత్సవాలతో పాడేరు మెయిన్‌రోడ్డులో సందడి నెలకొంది.

వేడుకగా అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసాలు కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

సింహాచలం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. స్వామి సన్నిధిలో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. లక్ష్మీనారాయణ వత్ర మండపంలో అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: పండగల రద్దీ దృష్ట్యా విజయవాడ-శ్రీకాకుళంరోడ్-విజయవాడ మధ్య ఆయా తేదీల్లో స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విజయవాడ-శ్రీకాకుళం రోడ్(07215) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17వ తేదీల్లో రాత్రి 8 గంటలకు విజయవాడలో బయల్దేరి తెల్లవారు 1.28 గంటలకు దువ్వాడకు, ఉదయం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం రోడ్- విజయవాడ(07216) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ శ్రీకాకుళం రోడ్‌లో ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18వ తేదీల్లో ఉదయం 6.30 గంటలకు బయల్దేరి ఉదయం 9.30 గంటలకు దువ్వాడకు సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకుంటుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు : పండగల వేళ పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నట్లు రైల్వే అధికారులు సూచించారు. విశాఖపట్నం -కోరాపుట్-విశాఖపట్నం (08546/08545) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 17వ తేదీ వరకు, విశాఖపట్నం-భవానిపట్న- విశాఖపట్నం (08504/08503) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 18వ తేదీ వరకు, విశాఖపట్నం-బ్రహ్మపూర్- విశాఖపట్నం (08532/08531) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 17వ తేదీ వరకు, విశాఖపట్నం-రాయ్‌పూర్-విశాఖపట్నం (08528/27) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 18వ తేదీ వరకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నారు.

కోర్సు కో-ఆర్డినేటర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కేజీహెచ్, ఏఎంసీలోని నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్ సెంటర్‌లో కోర్సు కో-ఆర్డినేటర్ ఉద్యోగానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. నెలకు రూ.40 వేల జీతం చెల్లిస్తారు. నెల్స్ స్కిల్ ల్యాబ్‌లో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 18లోగా పరిపాలన కార్యాలయం, ఆంధ్రా మెడికల్ కాలేజీలో దరఖాస్తులు సమర్పించాలి. వివరాలు, దరఖాస్తు కోసం https://amc.edu.in/ ను సందర్శించాలని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఓ ప్రకటనలో సూచించారు.

చాపరాయి అందాలు చూద్దాం రారండి



పర్యాటకులతో కిటకిటలాడుతున్న చాపరాయి



డుంబ్రిగుడ: ప్రముఖ సుందర పర్యాటక కేంద్రం చాపరాయి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పర్యాటకు లకు ఈ సీజన్‌కు రారామ్మంటోంది. ఉదయం మంచు దుప్పటితో పాల సంద్రంలా దర్శనమిస్తోంది. మధ్యాహ్నం పర్యాటకులతో కిటకిటలాడుతోంది. రాత్రి పూట విద్యుత్ దీపాలంకరణలో ధగధగలాడుతోంది.

జూనియర్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: దక్షిణ మండల అంతర జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఈనెల 16నుంచి ప్రారంభం కానుంది. నాగార్జున వర్సిటీలో జరగనున్న ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి అండర్ 14 నుంచి అండర్ 20 వరకు నాలుగు కేటగిరిల్లో బాల బాలికలను జిల్లా అథ్లెటిక్ సంఘం ఎంపిక చేసింది. వీరంతా 16వ తేదీన ఉదయం 9 గంటలకల్లా ఏఎన్‌యూ గ్రౌండ్స్‌లో హాజరై వయస్సు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుందని సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు. జూనియర్ మెన్‌లో పవన్‌కుమార్, శెట్టిలోహిత్, షేక్ జబీహర్, కిరణ్‌కుమార్, వెంకటేష్, గోపాలకృష్ణ, నేతాజీ, శామ్యూల్‌రాజ్ ఎంపిక కాగా జూనియర్ వుమెన్‌లో నాగలక్ష్మి, భారతి, సాయి, పుష్ప ఆయా అంశాల్లో ఎంపికయ్యారు. యూత్ బాలురలో శేషు, జశ్వంత్, ఓంకార్, సాంబశివరావు, చంద్రశేఖర్, సింహాచలం ఎంపిక కాగా బాలికల్లో శైలజ, త్రిష, సాయివర్షిణి, అయేషా భాను, హాశిత, భావన ఎంపికయ్యారు. అండర్ 16 బాలురలో కిరణ్‌సాయి, సౌరభ్‌కుమార్, రాముడు ఎంపిక కాగా బాలికల్లో ప్రవల్లిక, సత్యసహశ్రిక, తేజస్విని, బిందుహాసిని ఎంపిక కాగా పెంటాథ్లాన్‌లో కాంక్షశ్రీ, చైతన్య పాల్గొనున్నారు. అండర్ 14 బాలురలో కుమార్‌దార, దివాకర్‌లు, బాలికల్లో బి.ఇషానా, జి.కావ్య, ఈ.సోనియా ట్రయాథ్లాన్‌లో పాల్గొనున్నారు.

క్లుప్తంగా

నేడు కొక్కిరమ్మతల్లి అమ్మవారి ఉత్సవం

జి.మాడుగుల: చింతపల్లి రోడ్డు మార్గంలో కొక్కిరాపల్లిలో కొలువై ఉన్న కొక్కిరమ్మ తల్లి ఉత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గబ్బాడి శేఖర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో వెలసిన కొక్కిరమ్మ తల్లి ఆలయ సన్నిధిలో ఆలయ ధర్మకర్త వనభంగి బాలయ్యదొర ఆధ్వర్యంలో గుదలంవీధిలో గల అంజనాద్రి ఆశ్రమం సింహాచలం సిద్ధియోగి గురూజీ హోమం నిర్వహంచనున్నట్టు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు. ఆలయ కమిటీ సభ్యులు మత్స్యరాజు, మోహన్‌రావు, బాలాజీ, అరుణ్, నూకరాజు, నాయుడు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ల పంపిణీ



డస్ట్ బీన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరావు తదితరులు

పెదబయలు: సీతగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని రోగులపేట. రోగులపేట కాలనీ, కుమ్మరిపుట్టు గ్రామాల్లో ప్రతీ ఇంటికి ప్లాస్టిక్ డస్ట్ బీన్లను సర్పంచ్ పలాసి మాధవరావు బుధవారం పంపిణీ చేశారు. చెత్త ఎక్కడ బడితే అక్కడ పడేయకుండా తడి, పొడి చెత్తలు వేర్వేరుగా ఉంచాలని వాటిని పారిశుధ్య కారిృకులకు అందజేయాలన్నారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రంలో తరలించి ఎరువు తయారుచేయనున్నట్టు తెలిపారు. ప్రతీ ఒక్కరు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వినియోగించాలన్నారు. ఉప సర్పంచ్ గంగాధరం, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన కృష్ణను పీహెచ్‌సీకి తరలిస్తున్న స్థానికులు

పెదబయలు : సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామ సమీపంలో బుధవారం ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట గ్రామానికి చెందిన చిరు వ్యాపారి కృష్ణకు కాలిభాగంలో బలమైన గాయాలయ్యాయి. పెదబయలు పీహెచ్‌సీ అంబులెన్స్‌లో పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయాలైన కృష్ణ భవానీదీక్షలో ఉన్నారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

- శిథిలావస్థలో బస్సు షెల్టర్లు
- కానరాని సదుపాయాలు
- ఆరుబయటే నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు

నిలువ నీడేది?



నిరుపయోగంగా పెదబయలు మినీ కాంప్లెక్స్



మంగభంగిలో షెల్టర్ లేక ఎండలో కూర్చున్న ప్రయాణికులు

పెదబయలు: ప్రయాణికుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి నిర్మించిన బస్సుషెల్టర్లు నిరుపయోగంగా మారడం వల్ల నిత్యం ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పాడేరు నుంచి జోలాపుట్టు, డుడుమ వెళ్లే రహదారిలో ప్రతీ స్టేజీ వద్ద బస్సు స్టాప్‌లను 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ఏళ్ల తరబడి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెదబయలు మండల కేంద్రంలో సుమారు 20 ఏళ్ల క్రితం రూ.5.50 లక్షలు వెచ్చించి బస్సు షెల్టర్లను నిర్మించారు. సుమారు రెండు దశాబ్దాలుగా వీటి పర్యవేక్షణ లేకపోవడం, కొద్దిపాటి మరమ్మతులకు కూడా ఆర్టీసీ అధికారులు చొరవచూపకపోవడం వల్ల షెల్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. సదుపాయాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

కూలిన పైకప్పులు

పాడేరు మొదలుకుని గుత్తులపుట్టు, మఠం, గంపరాయి, గలగండ, ఈదులపుట్టు, మంగబంధ, అరడకోట, బంగారుమెట్ట, పెదబయలు, సీతగుంట, బస్సు షెల్టర్ పూర్తిగా శిథిలమైన పైకప్పు రేకులు కూడా లేకుండాపోయింది. కొన్నిచోట్ల సిమెంటు పునాదులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పెదబయలు మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ భవనం వినియోగంలోకి తెచ్చిన ప్రయాణికులు కూర్చొవడానికి ఎలాంటి సదుపాయాలు లేకపోవడం, టాయిలెట్స్ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సు షెల్టర్ మరమ్మతులకు గురికావడం వల్ల ప్రయాణికులు సేదతీరడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం, ఎండాకాలంలో షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీకి ఆదాయం బాగానే ఉన్నా ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు.

అలాగే కొన్ని చోట్ల కొత్తగా బస్సు షెల్టర్లు నిర్మించాల్సి ఉందని,అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పెదబయలు మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ వినియోగం తేవాలని పాడేరు నుంచి ముంచంగిపుట్టు వచ్చిపోయే ఆర్టీసీ బస్సులు మినీ కాంప్లెక్స్‌లో ఆపాలని దీంతో పెదబయలు ప్రధాన కూడలిలో ట్రాపిక్ సమస్య తగ్గుతుందని మండల వాసులు కోరుతున్నారు.

బస్సు షెల్టర్ నిర్మించాలి



మండలంలోని కొత్తాపుట్టు జంక్షన్‌లో బస్సు షెల్టర్ నిర్మించాలి.ఈ జంక్షన్‌లో ప్రతి రోజు వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. ఈ జంక్షన్‌లో బస్టాప్ లేక కనీసం చెట్టు కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.అధికారులు దృష్టి సారించి బస్సు షెల్టర్ నిర్మించాల్సి ఉంది. గతంలో పలుచోట్లు నిర్మించిన బస్సు షెల్టర్లు వినియోగంలోకి తేవాలి. లేని చోట్ల నిర్మించాలి.

– నల్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ, పెదబయలు మండలం

మినీ బస్సు కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి



పెదబయలు మండల కేంద్రంలో రూ.5.50 లక్షలతో నిర్మించిన మినీ బస్ షెల్టరును వినియోగంలోకి తీసుకురావాలి. బస్సు కాంప్లెక్స్ నిరుపయోగంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆర్టీసీ అధికారులు ప్రతీ రోజు కాంప్లెక్స్‌లో బస్సులు నిలిపేటట్టు చర్యలు తీసుకోవాలి. అలాగే బంగారు మెట్ట జంక్షన్ నుంచి మద్దిగరువు వరకు బస్సు షెల్టర్లు లేవు. ప్రతీ స్టేజీలో నిర్మిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవు.

– పాంగి సింహాచలం, మాజీ సర్పంచ్, గోమంగి, పెదబయలు మండలం

అధికారులకు నివేదిస్తాం

మండలంలో ఆర్‌అండ్‌బి రహదారికి ఆనుకుని చాలా వరకు బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. సర్వసభ్య సమావేశంలో సభ్యుల అనుమతితో తీర్మాణం చేసి సంబంధిత అధికారులకు నివేదించడం జరుగుతుంది. వర్షాకాల, ఎండకాలంలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం.

– వి.విగ్గిన్స్, ఎంపీడీవో, పెదబయలు

పంటల సాగుపై అవగాహన



పెద్దతమ్మెంగులలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు, తదితరులు

ముంచంగిపుట్టు: మండలంలోని జర్జుల పంచాయతీ పెద్దతమ్మెంగుల గ్రామంలో బుధవారం మండల వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు మాట్లాడుతూ గిరిజన రైతులు అధిక దిగుబడి వచ్చే పంటలను పండించాలన్నారు. గిరిజన రైతులు కాఫీ, మిరియాలు పంటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు వేయడం వల్ల ఆర్థికంగా లభాలు వస్తాయన్నారు. వ్యవసాయశాఖాధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. హార్టీకల్చర్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్, వెటర్నరీ అసిస్టెంట్ బుచ్చిబాబు, కాఫీ లైజెన్ వర్కర్ నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

95 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: పి.ఎం.ఎస్.ఎం.ఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం 95 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 28 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించి, ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన గర్భిణులకు భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాలజిస్టు డాక్టర్ తబస్సుమ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



చింతపల్లిలో నిరసన తెలియజేస్తున్న హెచ్‌డబ్ల్యూఓలు

చింతపల్లి: చాలీచాలని వేతనాలతో బతుకెళ్లదీస్తున్న సీహెచ్‌డబ్ల్యూవోలకు మూడు నెలల నుంచి ప్రభుత్వం వేతనాలను మంజూరు చేయడం లేదని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా సీహెచ్‌డబ్ల్యూవోల సంఘం అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో సుమారు 700 మంది సీహెచ్‌డబ్ల్యూవోలు పనిచేస్తున్నామన్నారు. వీరికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేవడం లేదన్నారు. దసరా పండగకు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయి పడ్డ వేతనాలను మంజూరు చేయకపోతే త్వరలో పాడేరు ఐటీడీఏ వద్ద ఆందోళన చేపడతామని పద్మ హెచ్చరించారు. ఆ సంఘం నాయకులు దేబోరా, సత్యవతి, పావని, అప్పలమ్మ, కుమారి, బాలమ్మ, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి



చింతపల్లిలోని సంత దుకాణాలను పరిశీలిస్తున్న నాబార్డు డీడీఎం చక్రధర్, చిత్రంలో చింతపల్లి ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత

చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో బ్యాంకు సేవలతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిటరసీపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు అల్లూరి జిల్లా నాబార్డు డీడీఎం(జిల్లా అభివృద్ధి అధికారి) చక్రధర్ అన్నారు. ఆయన చింతపల్లిలో బుధవారం పర్యటించారు. నాబార్డు నిధులతో చింతపల్లిలో నిర్మించిన సంత దుకాణాలను ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలతతో కలసి పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో రూరల్ హాట్‌లను నిర్మిస్తున్నామన్నారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాబార్డు నిధులతో అల్లూరి జిల్లాలో 4500 ఎకరాల్లో ఉద్యానపంటల సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. మాతోట కార్యక్రమం కింద ఒక్కో ఎఫ్‌పీఓకు రూ.3కోట్ల వరకూ ఆర్థికసాయాన్ని నాబార్డు మంజూరు చేస్తుందన్నారు. గిరిజన వికాస్ సీఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

జంతువుల వేటకు విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు



సీఐ నరసింహమూర్తి

వై.రామవరం: అడవి జంతువుల వేట కోసం కొండలు, పొలాల సమీపంలోను, అటవీ ప్రాంతంలోను విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు తప్పవని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి హెచ్చరించారు. వై.రామవరం పోలీసుస్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అడవి జంతువుల వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల వల్ల అమాయక గిరిజనులు మృతిచెందుతున్నారన్నారు. ఇలాంటి ఘటనల్లో భాగంగా ఇటీవల మండలంలోని దేవరమడుగులు గ్రామానికి చెందిన లోతా సూరిరెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురు నిందితులను జైలుకు పంపించినట్టు చెప్పారు. ఇటువంటి దుశ్చర్యలకు(నేరాలకు) పాల్పడితే ఎంతటి వారైన క్షమించేది లేదని హెచ్చరించారు. కఠిన శిక్షతో జైలు పాలై జీవితాలు పాడుచేసుకో వద్దన్నారు. అలాగే గంజాయి అక్రమ రవాణాకు సహకరించి జైలు పాలవద్దని హెచ్చరించారు. గంజాయితో పట్టుబడితే ఎంతటివారైన క్షమించేది లేదన్నారు. అధిక సొమ్ముకు కోసం ఆశపడి గంజాయి అక్రమ రవాణాకు చేస్తూ పట్టుబడిన జైలు పాలై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అక్రమ రవాణా సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. పండుగల పేరుతో జూదం కోడిపందాలు జోలికి వెళ్లొద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు.

పెట్రోల్ బంక్‌లో సమస్యలు.. వినియోగదారుల అవస్థలు



బంక్ వద్ద మూలకు చేరిన గాలిని నింపే యంత్రం

కొయ్యూరు: కాకరపాడు హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌లో కొన్ని సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన వాహనాలకు గాలి నింపే యంత్రం వాడకుండానే మూలకు చేరింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనచోదకుల వాహనాలకు గాలి పెట్టేందుకు అవస్థలు పడుతున్నారు. ప్రతీ పెట్రోల్‌బంక్ వద్ద విధిగా గాలిని నింపే యంత్రంతో పాటు మరుగుదొడ్లు కూడా ఉండాలన్న నిబంధన ఉంది. ఇందులో భాగంగా కాకరపాడు బంక్‌లో గాలి నింపే యంత్రాన్ని ఏర్పాటు చేశారు .అయితే దానిని ఇంత వరకు వినియోగించలేదు. దీని మూలంగా అది పాడైపోతుంది. దీనిని అమరిక పూర్తయినా దానికి అవసరమైన విద్యుత్‌ను అండర్ గ్రౌండ్ నుంచి ఇవ్వాల్సి ఉంది. దీనిని హెచ్‌పీసీఎల్ సాంకేతిక నిపుణులు చేయాలి.అయితే ఇంత వరకు వారు చేయలేదు. ఫలితంగా వాహనదారులు కొన్ని సందర్భాలలో అవస్థలు పడుతున్నారు.ఇప్పటికైనా హెచ్‌పీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహణదారులు కోరుతున్నారు.

జరగని డిజిటల్ చెల్లింపులు

ఇక్కడి పెట్రోల్ బంక్‌లో కొద్ది రోజుల నుంచి డిజిటల్ చెల్లింపులు నిలిచిపోయాయి. సాంకేతిక సమస్య మూలంగా డిజిటల్ చెల్లింపులు జరగడం లేదు. దీనిపై జీసీసీ బీఎం విజయకుమార్ మాట్లాడుతూ త్వరలో డిజిటల్ చెల్లింపులను పునరుద్ధరిస్తామన్నారు. గాలి నింపే యంత్రాన్ని మరమ్మతు చేసి, వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

జిల్లా కేంద్రం తరలింపు యోచనను విరమించుకోవాలి



వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి



ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ రాజులమ్మ



కిరణ్‌కుమార్

ముంచంగిపుట్టు: అల్లూరి జిల్లా కేంద్రం తరలించే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి అన్నారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాభివృద్ధి కోసం పాడేరును జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. దీంతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతున్న తరుణంలో జిల్లా కేంద్రం మైదాన ప్రాంతానికి తరలించే ఊహాగానాలు అధికమయ్యాయన్నారు. చంద్రబాబు పాలనలో ఎప్పుడు గిరిజనులకు అన్ని విధాలుగా అన్యాయం చేస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం సోషల్ మిడియాలో జిల్లా కేంద్రం నర్సీపట్నం తరలింపుపై విస్తృతంగా ప్రచారం జరుగుతుందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, లేని పక్షన గిరిజనులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృత చేస్తామని ఆమె హెచ్చరించారు.

కొయ్యూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరును నర్సీపట్నంకు తరలించాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ నాయకురాలు జె.రాజులమ్మ స్పష్టం చేశారు.ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధికి దూరంగా ఉన్న మన్య ప్రాంతాభివృద్ధి చేయాలన్న తలంపుతో అల్లూరి జిల్లాను ఏర్పాటు చేశారన్నారు.దానిని విస్మరించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం నర్సీపట్నం కేంద్రంగా ఏర్పాటు చేయాలని చూస్తే ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో దీక్షలను చేపడతామన్నారు.

అరకులోయ రూరల్: ఆదివాసీ గిరిజనులపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు తగదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రజలపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, అందుకే పాడేరు జిల్లా కేంద్రాన్ని నర్సీపట్నం తరలించే కుట్రకు తెరలేపిందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా కుట్ర రాజకీయలను చేస్తోందన్నారు. జిల్లా కేంద్రాన్ని తరలించే ఆలోచనను తక్షణమే కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని స్పష్టం చేవారు. సూపర్ సిక్స్ హామీలు, నిరుద్యోగ భృతి అందజేయాలన్నారు.

- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- సరస్వతీ దేవీ అవతారంలో అమ్మవారి అలంకరణ
- దుర్గమ్మకు ప్రత్యేక పూజలు
- విద్యార్థులతో కిటకిటలాడిన ఆలయాలు

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజలు



పవనగిరి క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు







జి.మాడుగుల, వసువాడ, పాడేరు ప్రాంతాల్లో ఆలయాల్లో ప్రత్యేకాలంకరణలో అమ్మవార్లు





చింతపల్లి, పెదబయలు ప్రాంతాల్లో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

పెదబయలు: శరన్నవ రాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు వాగ్దేవతామూర్తి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ శుద్ధ సప్తమి మూలా నక్షత్రం జగన్మాత జన్మ నక్షత్రం. దీంతో ఊరూ వాడా అమ్మవారి ఆలయాలు, విగ్రహాలను కొలువుదీర్చిన మండపాలు భక్తులతో కళకళలాడాయి. సరస్వతీదేవి రూపంలోని దర్శనమిచ్చిన అమ్మవారిని విద్యార్థులు దర్శించుకుని, విద్యాబుద్ధులకై ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల అమ్మవారి ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. మండలం కేంద్రంలో మోద హరిహరపుత్ర మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మండపంలో బుధవారం పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిగింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సింహాచలం, మోటార్ యూనియన్ నాయకులు నీలయ్య, కిశోర్, అంజిబాబు, అజయ్‌కుమార్, శ్రీను తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జి.మాడుగుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద దసరా వేడుకల్లో భాగంగా ఏర్పాటుచేసిన మండపంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న సీఐ వెంకటరావు, ఎస్ఐ షణ్ముఖరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవర్చుకోవాలన్నారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు జరిపారు.



రంపచోడవరంలోని ఆలయంలో సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు

గూడెంకొత్తవీధి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గూడెంకొత్తవీధి మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని వసువాడ గ్రామంలో గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

చింతపల్లి: చింతపల్లి రంగాసెంటర్‌లో కొలువైన దుర్గాదేవి మండపంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు, చిన్నారులకు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.



సీలేరులో చిన్నారులకు అక్షరాభ్యాసం

సీలేరు: సీలేరులో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరస్వతి దేవి అమ్మవారి అవతారంలో దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. సందర్భంగా మండపంలో చిన్నపిల్లలకు అక్షరభ్యాసాలు చేశారు. దారకొండలో సరస్వతి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చిన్నారులకు సరస్వతి పూజలు నిర్వహించి అక్షరభ్యాసం చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి సారె ఊరేగించి సమర్పించారు.సమరత సేవ ఫౌండేషన్ జిల్లా సంయోజకులు గణేశ్వరరావు, రాము గురు, దుర్గమ్మ పాల్గొన్నారు.



పెదబయలులో అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అడ్డతీగల: శరన్నవ రాత్రుల్లో భాగంగా పవన గిరి క్షేత్రంలో కొలువైన గిరి దుర్గా భవాని అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పవన గిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయ లక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.

రంపచోడవరం: రంపచోడవరం సంత మార్కెట్ దేవీ గుడి సెంటర్‌లోని కనక దుర్గ మాత ఆలయం, స్టేట్ బ్యాంకు సమీపంలోని శ్రీత్రిశక్తి స్వరూపిణి దుర్గా పరదేవత ఆలయాల్లో సరస్వతి పూజను అర్చకులు బ్రహ్మశ్రీ సరస్వతి మణికంఠ, లింగాల సీతారామాంజనేయ, ప్రసన్నకుమార్, చింతా పవన్‌కుమార్‌లు నిర్వహించారు. విద్యార్థులు, స్థానికులు పూజలు చేశారు.